ప్రజాశక్తి
సోమవారం 11 సెప్టెంబర్ 2023
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

కొనసాగిన టిడిపి నిరసనలు

- పార్టీ కార్యాలయాల ఎదుట సామూహిక దీక్షలు
- గృహ నిర్బంధంలోనే ముఖ్య నేతలు
- అవినీతిని నిరూపిస్తే పీక కోసుకుంటానన్న అచ్చెన్నాయుడు



విశాఖలో దీక్షలు చేపట్టిన పల్లా శ్రీనివాసరావు తదితరులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, విలేకరుల యంత్రాంగం

చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో రెండో రోజైన ఆదివారమూ నిరసనలు ఎగసిపడ్డాయి. టిడిపి నియోజకవర్గ కార్యాలయాల వద్ద సామూహిక నిరాహార దీక్షలకు టిడిపి కార్యకర్తలు దిగారు. విశాఖలోని ఎంవిపి కాలనీ రైతు బజారు వద్ద ఆందోళనకు దిగిన తెలుగు తమ్ముళ్లను పోలీసులు అరెస్టు చేశారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు దీక్షకు దిగారు. నలుపు వస్త్రాలు ధరించి ప్లకార్డులు చేబూని ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆయన పెద్దపెట్టున నినాదాలు చేశారు. నక్కపల్లిలో ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నల్ల జెండాలు చేతబట్టి టిడిపి కార్యకర్తలు నిరసన చేపట్టారు. అనకాపల్లి జిల్లా కేంద్రంలో చేపట్టిన దీక్షల్లో మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పాల్గొన్నారు. చోడవరం, యలమంచిలి, మునగపాక, అచ్యుతాపురం సహా అన్ని మండల కేంద్రాల్లోనూ నిరసనలు కొనసాగాయి. ముఖ్య నేతల ఇంటి వద్ద ఆదివారమూ పోలీసు పహారా కొనసాగింది. పలువురు నేతలను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు.



చంద్రబాబుకు రిమాండ్ విధించిన విషయం తెలిసి రోధిస్తున్న మహిళా కార్యకర్త

ప్రభుత్వ తీరుపై అచ్చెన్న, గంటా మండిపాటు

వైసిపి తీరుపై టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు మిగతా 2లో..



నర్సీపట్నంలో నిరసన తెలుపుతున్న అయ్యన్నపాత్రుడు



ఎగ్జిబిషన్‌లో కొలువుదీరిన అరకు కాఫీ ఉత్పత్తులు

జి-20 సమ్మిట్‌లో..

అరకు కాఫీ ఘుమఘుమలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : న్యూఢిల్లీలో జరుగుతున్న జి - 20 సమ్మిట్‌లో ఆంధ్రప్రదేశ్ పెవిలియన్‌లో గిరిజన సహకార సంస్థ (జిసిసి) అరకు వ్యాలీ కాఫీ ఘుమఘుమలాడుతోంది. అగ్ర దేశాల అధినేతలంతా పాల్గొంటున్న ఈ సమ్మిట్‌లో అరకు కాఫీ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో గిరిజన రైతులు పండించిన కాఫీని అక్కడి ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. అరకు కాఫీలో నాణ్యత, కాఫీ సాగులో స్థిరమైన, పర్యావరణ అనుకూలమైన పద్ధతులను అక్కడి వాలంటీర్లు సందర్శకులకు వివరిస్తున్నారు. తాజా ప్రదర్శన అంతర్జాతీయ మార్కెట్‌లో జిసిసి అరకు వ్యాలీ కాఫీకి కొత్త మార్గాలను తెచ్చిపెడుతుందని పలువురు భావిస్తున్నారు. ప్రపంచ దేశాలకు మన గిరిజనులు పండించిన అరకు కాఫీ రుచులను పరిచయం చేయడం సంతోషంగా ఉందని గిరిజన సహకార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్ కుమార్ పేర్కొన్నారు. ఎగ్జిబిషన్‌లో ప్రదర్శనకు అవకాశమిచ్చిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

వైరల్ జ్వరంతో జెడ్‌పి వైస్ ఛైర్మన్ మృతి

▸ వార్త మెయిన్‌లో..

అనకాపల్లిలో 'వేడుకోలు నిరాహారదీక్ష'

▸ వార్త 5లో..

డిఆర్‌ఒగా మోహన్ కుమార్ బాధ్యతల స్వీకరణ

▸ వార్త 2లో..

రోజా కన్నన్‌కు సరోజా వైద్యనాథన్ ఎక్సలెన్స్ అవార్డు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అఖిల భారత స్థాయి శాస్త్రీయ నృత్యోత్సవాలకు వేళైంది. దీనిలో కలికితురాయిగా నిలిచే వైశాఖి నృత్యోత్సవం-2023 ఈ నెల 15, 16, 17 తేదీలలో కళాభారతి ఆడిటోరియంలో జరుగనుంది. ఈ సందర్భంగా నిపుణుల కమిటీ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నాట్యరంగ నిష్ణాతులకిచ్చే వైశాఖి ఎక్సలెన్సీ అవార్డుల వివరాలను ఫెస్టివల్ డైరెక్టర్, ద డ్యాన్స్ ఇండియా ఆంగ్ల మాసపత్రిక సంపాదకులు బిఆర్.విక్రమ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. పద్మభూషణ్ గురు డాక్టర్ సరోజా వైద్యనాథన్ ఎక్సలెన్స్ అవార్డు - 2023కు తమిళనాడుకు చెందిన సుప్రసిద్ధ భరతనాట్య కళాకారిణి, ఆచార్య చూడామణి అవార్డు గ్రహీత రోజా కన్నన్ ఎంపికైనట్టు ఆయన తెలిపారు. ఆమె తన బృందంతో వైశాఖి ఉత్సవాల తొలిరోజైన 15వ తేదీ సాయంత్రం ప్రదర్శన ఇవ్వనున్నట్టు వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన భరతనాట్య కళాకారిణి డాక్టర్ ఉమా రేలే వైశాఖి ఎక్సలెన్స్ జాతీయ పురస్కారానికి ఎంపికవగా ఉమా, నలందా బృందంతో కలిసి ఉత్సవాల రెండో రోజైన 16వ తేదీ సాయంత్రం ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. ఈ ఏడాది పద్మభూషణ్ గురు డాక్టర్ సరోజా వైద్యనాథన్ నేషనల్ యువ పురస్కారాలకు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కూచిపూడి నాట్య మిగతా 2లో..



నాట్యకారిణి రోజా కన్నన్ (ఫైల్‌ఫొటో)

ప్రణాళికలతో చెరుకులో లాభాలు

- జీవన ఎరువుల వినియోగంతో మేలు
- 'ప్రజాశక్తి'తో ఆర్‌ఎఆర్‌ఎస్ పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ జగన్నాధరావు

ప్రజాశక్తి - అనకాపల్లి

వ్యవసాయ శాస్త్రవేత్తలు రూపొందించిన నూతన పరికరాలు, వైరస్ తెగుళ్లను తట్టుకునేందుకు.. దిగుబడులు, రసనాణ్యత పెరిగేందుకు రూపొందించిన జీవన ఎరువుల వినియోగం వల్ల రైతుకు చెరుకు సాగు లాభసాటిగా మారనుందని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ పివికె.జగన్నాధరావు తెలిపారు. చెరుకు సాగులో అవలంబించాల్సిన పద్ధతులను ఆయన 'ప్రజాశక్తి'కి వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

చెరుకులో దిగుబడులు తగ్గడానికి ప్రధాన కారణాలేంటి ?

ఈ మధ్య చెరుకులో దిగుబడులు తగ్గడానికి ప్రధాన కారణం వైరస్ తెగుళ్లు. ముఖ్యంగా పసుపు ఆకు, మొజాయిక్ తెగుళ్లు రైతుకు తీవ్ర నష్టాన్ని కలగజేస్తున్నాయి. సక్రమ యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా వీటిని నివారించవచ్చు. అలాగే తెగులు ఉధృతి తగ్గి అధిక దిగుబడులు సాధించవచ్చు. నాణ్యమైన విత్తన ఎంపికతో పాటు సిఫార్సు చేసిన రసాయన ఎరువులను సేంద్రియ



ఎరువులతో కలిపి వాడుకుంటే మొక్కకు కావాల్సిన అన్ని పోషకాలూ అందుతాయి.



చీడపీడలను తట్టుకునే శక్తి రావడంతో పాటు రస నాణ్యత కూడా పెరుగుతుంది. అయితే ప్రస్తుతం రసాయన ఎరువుల ధరలు ఆకాశాన్ని అంటడంతో రైతు కొనుగోలు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

కొనసాగిన టిడిపి నిరసనలు

ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కిల్ డవలప్‌మెంట్ కేసులో చంద్రబాబుకుగానీ, తన కుటుంబానికిగానీ పైసా లబ్ధి చేకూరినట్టు నిరూపిస్తే పీక కోసుకుంటానని అచ్చెన్నాయుడు అన్నారు. కక్ష సాధింపునకే చంద్రబాబును అన్యాయంగా అరెస్టు చేశారని, రాష్ట్రంలో చట్టం, ధర్మానికి విలువ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రెండేళ్ల క్రితం నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో తన పేరుగానీ, చంద్రబాబు పేరుగానీ లేవని, ఇప్పటికే ఈ కేసు విషయంలో పలువురు అరెస్టయి జైలుకు వెళ్లారని, అటువంటిది ఇప్పుడు తమపై కేసులు పెట్టడం దురుద్దేశంతో కూడినదేనని అన్నారు. మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ రెండు రోజులుగా చంద్రబాబును ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందన్నారు. వైసిపి నాయకులు, మంత్రులు ఇష్టం వచ్చినట్టు మాట్లాడటం సరికాదన్నారు. కనీసం అవగాహన లేని వారు వైసిపి ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్నారన్నారు. దేశంలో జి - 20 సదస్సు జరుగుతుంటే రాష్ట్రంలో మాత్రం ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఎన్ని రాజకీయ కుట్రలు చేసినా తప్పకుండా చివరికి న్యాయమే గెలుస్తుందని తెలిపారు. జగన్ గతంలో జైలు జీవితం గడిపినందున చంద్రబాబునూ ఏదో ఒక రకంగా జైల్లో పెట్టాలని మొదటి నుంచీ సైకోలా ఆలోచిస్తూ వచ్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన తీరు మార్చుకుని రాజ్యాంగానికి అనుగుణంగా నడుచుకోవాలని కోర్టులు ఇప్పటికే చాలా సార్లు మొట్టికాయలు, చీవాట్లు పెట్టిన విషయాన్ని గుర్తుచేశారు.

ప్రణాళికలతో చెరుకులో లాభాలు

చేసే శక్తి లేక మొక్కకు కావలసిన పోషకాలను అందించలేకపోతున్నాడు. దీంతో వైరస్ తెగుళ్ల బారిన పడి పంట దిగుబడి తగ్గుతోంది.

ఎటువంటి పోషకాలు చెరుకు పంటకు అందించాలి ?

చెరుకు పంటకు మిగిలిన పొటాషియం వంటి రసాయన ఎరువులు, సేంద్రియ ఎరువులను వేయలేక రైతులు నత్రజనిపై ఆధారపడుతున్నారు. సిఫార్సు చేసిన మోతాదుకు మించి నత్రజని వేయడం వల్ల చీడపీడల బారిన పంట పడి నాశనం అవుతుంది.

తెగుళ్లను నివారించేందుకు ఆర్ఎఆర్ఎస్ ఏమైనా ఎరువులను రైతులకు సూచిస్తుందా ?

పొటాషియం వంటి ఎరువులను వేసుకోలేని రైతులకు ఆర్ఎఆర్ఎస్ చెరుకు పంటకు కావలసిన వివిధ రకాల పోషకాలను అందించే జీవన ఎరువులను తయారుచేసి అతి తక్కువ ధరకే (అర లీటర్ రూ.150 రూపాయలు) అందుబాటులోకి తెచ్చింది. పొటాషియం రిలీజింగ్ బ్యాక్టీరియా (కెఆర్‌బి) జీవన ఎరువును చెరుకు నాటేటప్పుడు, నాటిన 45 నుంచి 50 రోజులలోపు రెండు దఫాలుగా ఎకరానికి అర లీటర్ చొప్పున బాగా మాగిన పశువుల గెత్తం కలుపుకొని 24 నుంచి 48 గంటలు నీడలో ఉంచి మొక్కల మొదట్లో వేసినట్టయితే 25 శాతం వరకు సిఫార్సు చేసిన పోషకాలను అందించవచ్చు. వీటి వాడకం వల్ల చీడపీడల ఉధృతి తట్టుకోవచ్చు. రస నాణ్యత పెరిగి మంచి దిగుబడులు సాధించవచ్చు.

చెరుకులో పసుపు ఆకు, మొజాయిక్ తెగుళ్ల నివారణ ఎలా ?

పసుపు ఆకు లక్షణాలు మొక్క తోటలో 7 నెలల నుంచి, కార్సి తోటలో మూడు నుంచి నాలుగు నెలలకు కనిపిస్తుంది. ఆకు మధ్య ఈనె పసుపు లేదా గులాబీ రంగులో మారుతుంది. ఆకు మధ్య ఈనె నుంచి పసుపు రంగు ఆకు చివర వరకు వ్యాపిస్తుంది. ఆకుల కొనల నుంచి కిందకి ఎండిపోతాయి. మొవ్వు ఆకులు నిటారుగా నిలిచి ఉండి కణుపుల మధ్య దూరం తగ్గుతుంది. దీనికి యాజమాన్య పద్ధతులు అవలంబించాలి. తెగులు సోకని ఆరోగ్యకరమైన విత్తన ఎంపిక, టిష్యూ కల్చర్ ద్వారా రూపొందించిన వ్యాధి రహిత విత్తనాన్ని వాడుకోవడం అవసరం. ఈ తెగులును వ్యాప్తి చేసే పేను బంక పురుగు నివారణకు డైమిథోయేట్ 2 మిల్లీ లీటర్లు లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు లీటరు నీటికి చొప్పున కలుపుకొని పిచికారీ చేసుకోవాలి. పంటకు నిర్దేశించిన ఎరువులను సకాలంలో వేసుకోవాలి. మొజాయిక్ తెగులు లక్షణాలను మూడు నెలల వయసులోనే గమనించవచ్చు. లేత ఆకులపై లేత ముదురు ఆకుపచ్చ రంగు మచ్చలు ఉంటాయి. తెగులు ఉధృతమైనప్పుడు ఆకులు పసుపు రంగులోకి మారి ఆకు అంచులు ఎరుపు రంగు కలిగి ఉంటాయి. తెగులు చివర దశలో ఆకులు ఎండి మొక్కలు గిడసబారుతాయి. వీటి నివారణకు తెగులు సోకని విత్తనం లేదా టిష్యూ కల్చర్ వ్యాధి రహిత విత్తనాలను వేసుకోవాలి. పేను బంక ద్వారా ఈ తెగులు ఉధృతమైతే పసుపు ఆకు తెగులుకు వేసిన మందులనే పిచికారీ చేసుకోవాలి. ఇతర వివరాలకు 9989625211, 9441944640 నెంబర్లను సంప్రదించాలి.

రోజా కన్నన్‌కు సరోజా వైద్యనాథన్ ఎక్సలెన్స్ అవార్డు

కళాకారిణి నాట్యశ్రీ బిరుదాంకితురాలు సూడగాని గీతా నారాయణ్, హాంగ్‌కాంగ్‌కు చెందిన భరతనాట్య కళాకారిణి రూపా కిరణ్‌లను తమ నిపుణుల కమిటీ ఎంపిక చేసినట్టు వెల్లడించారు.

డిఆర్‌ఒగా మోహన్ కుమార్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఒ)గా కె.మోహన్ కుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్‌టిఆర్ జిల్లా రెవెన్యూ అధికారిగా ఉన్న ఆయన్ని విశాఖ జిల్లా రెవిన్యూ అధికారిగా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయన ఆదివారం విశాఖ జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు కలెక్టరేట్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న మోహన్ కుమార్

ఈ కరువు ప్రభుత్వాల సృష్టే..!

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

కరువు కళ్లకు కట్టినట్లు కనబడుతున్నా ప్రభుత్వ పెద్దలకు కానొచ్చినట్లులేదు. ప్రకృతి ప్రతికూలత కంటే ప్రభుత్వ నిర్లక్ష్యమని గుర్తించి సిగ్గుకు ముఖం చాటేసి ఎమ్మెల్యేలు తిరుగుతున్నట్లుంది. ఇది వర్షాభావ పరిస్థితులతో వచ్చిన కరువుకాదిది. సాగునీటి వనరులను వృద్ధిచేయడంలో ప్రభుత్వాలు చూపుతున్న నిర్లక్ష్యంతో ఏర్పడిన దుర్భిక్షమిది. సాగునీటి వసతి కల్పనకు వనరుల సమస్యలేదుగానీ, వాటి వినియోగానికి సరిపడా నిధులు రాబెట్టుకోవడంలో ఎమ్మెల్యేల చేతగానితనం పాలు ఎక్కువవుంది. ఈ ఖరీఫ్‌లో 2.04 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు నమోదుకావాల్సివుండగా, ఇప్పటికి సగం కూడా పంటవేయలేని దుస్థితికి ముమ్మాటికీ ఏలినవారి తప్పిదమని నిందించకతప్పదు. ఏ మాత్రం ప్రజాప్రతినిధులంతా కలిసి కదిలి కాసులు విదుల్చుకోగలిగినా ప్రతిపాదిత ప్రాజెక్టులు పూర్తయ్యేవి. కరువుకాటకాల నుంచి రైతుకు విముక్తి లభించేది.

జిల్లాలోని 3.89 లక్షల మంది రైతుల్లో ఎకరాలోపు నుంచి ఐదెకరాల మధ్య భూమి కలిగిన సన్న, చిన్నకారు రైతులు 3.88 లక్షల మంది వున్నారు. సెంటు భూమిలేని, వున్నాగానీ అరెకరో, ఎకరో భూమి కలిగిన కౌలు రైతులు 40 వేల మంది వరకు ఉన్నారు. వ్యవసాయాధారిత జిల్లాలో వర్షాధారంపై సాగుచేస్తున్న రైతుకు సాగునీటి వసతి కల్పించాలన్న ధ్యాస ప్రభుత్వాలకూ లేదు. ఈ ప్రాంత ఎమ్మెల్యేలకూ లేదు. ఈ నిద్రావస్థలో వీరుండడంతో దశాబ్దం దాటుతున్నా అదనంగా ఎకరా ఆయకట్టుకు సాగునీటి సౌకర్యం కలగలేదు. ఖరీఫ్ సాధారణ సాగు 2.04 లక్షల ఎకరాల్లో అత్యధిక భాగం 1.36 లక్షల ఎకరాల్లో వరి పంటదే. 1.36 లక్షల ఎకరాల్లో తాండవ, పెద్దేరు, రైవాడ, కోనాం జలాశయాల కింద సగానికి మించి అంటే 75,414 ఎకరాల ఆయకట్టు వుంది. ఈ జలాశయాల మెయిన్ గేట్లు, ప్రధాన, పిల్ల కాలువలు సరిగాలేక 32 వేల ఆయకట్టుకే నీరు అందించగలిగారు.

కరువు మీదకొచ్చిపడినా



ప్రజాప్రతినిధులు బాధ్యతా రహితంగా వున్నారు. రైతు పడుతున్న బాధ వీరికేమీ పట్టినట్లులేదు. ఎమ్మెల్యేలకు కరువు కన్పించలేదో, రైతు గోడు వినబడ్డంలేదో తెలీదుగానీ స్పందించాల్సినంతగా వారిలో కదలికలేదు. జిల్లాలో కరువు పరిస్థితులపై కలిసి సమీక్షించి, వాస్తవ పరిస్థితిని ప్రభుత్వానికి విన్నవించాలన్న ఆలోచన ఏ మూలా వారిలో ఉదయించలేదు. రైతును ఆదుకోవాలన్న ఆతృత వారిలో అదృశ్యమైనట్లుంది. ఈ ప్రాంత అభివృద్ధికి కొంచెమైనా మనసుపెట్టి ఆలోచించాలి. ప్రభుత్వాన్ని ఒప్పించో, మెప్పించో, ఒత్తిడితెచ్చో 4.20 లక్షల ఎకరాలకు సాగునీరందించే పోలవరం ఎడమ కాలువ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పూర్తి చేయించాలి. ఇవి పూర్తయితే తప్ప కరువు నుంచి రైతుకు విముక్తి లభించదని ఎమ్మెల్యేలు గ్రహించాలి. ప్రాజెక్టుల పూర్తికి సరిపడా నిధులు రాబెట్టాలి. ఈ ప్రయత్నం పట్టుదలతో చేస్తూనే, ప్రస్తుత కరువును ఎదుర్కొనేందుకు స్వల్పకాలిక పంటలకు అవసరమైన విత్తనాలు ఉచితంగా సరఫరాచేసే చర్యలు ఆరంభించాలి. పంట రుణాలు రైతులందరికీ ఇవ్వాలి. పంటసాగు దారుహక్కు పత్రాలు (సిసిఆర్‌సి) లేవన్న సాకు చూపకుండా కౌలురైతుందరికీ సిసిఆర్‌సి కార్డులు మంజూరు చేయాలి. ప్రభుత్వ సాయం సిసిఆర్‌సి పొందిన 4,240 మందికి పరిమితం చేయకుండా కౌలురైతులందరికీ చేరేలా కృషి చేయాలి. ప్రభుత్వ ప్రాధాన్యతలెలావున్నా ప్రాజెక్టులు పూర్తి చేసుకోవాలన్న తమ ఆకాంక్షలు కార్యరూపందాల్చేలా రైతులు ఐక్యంగా కదలాలి. ప్రభుత్వం అలసత్వం వదిలి, ప్రతిపాదిత ప్రాజెక్టులు పూర్తిచేసే వరకు పట్టువిడవకుండా పోరాటాలు కొనసాగించాలి. రాజకీయ మనుగడకు ఈ ప్రాజెక్టులు పూర్తి అనివార్యమన్న ఆలోచన ప్రభుత్వంలో బలపడేలా ఆ పోరాటాలు నడవాలి. ఆ దిశగా రైతులు కదిలినప్పుడే కరువు కష్టాల నుంచి రైతుకు శాశ్వత విముక్తి కలుగుతుంది. కరువుకు పరిష్కారం దొరుకుతుంది.

1 నుంచి ఫిల్మ్ డైరెక్షన్ వర్క్‌షాప్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం, వైజాగ్ షార్ట్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ సంయుక్తాధ్వర్యంలో అక్టోబర్ 1, 2, 3 తేదీలలో ఫిల్మ్ డైరెక్షన్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్టు అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఇన్‌ఛార్జి జిఎస్.రాజేశ్వరరావు తెలిపారు. ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైజాగ్ షార్ట్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ ఆహద్ అష్రఫ్ మాట్లాడుతూ మూడు రోజులపాటు జరిగే ఈ ఫిల్మ్ డైరెక్షన్ వర్క్‌షాప్‌నకు సినీ దర్శకులు కళింగ రాజు, ఎల్లాజీ టీచర్లుగా వ్యవహరిస్తారన్నారు. డైరెక్షన్‌లో ఉన్నటువంటి అన్ని ప్రాథమిక అంశాలపై క్లుప్తంగా వివరిస్తారని తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శి ఎల్లాజీ మాట్లాడుతూ వర్క్‌షాప్ చివరి రోజు హాజరైన వారిని బృందాలుగా విభజించి జీరో బడ్జెట్ షార్ట్ ఫిల్మ్ నిర్మించడం, అక్కడే ఎడిటింగ్, రిలీజింగ్ వంటి పనులు చేపడతామన్నారు. ఉత్తమ చిత్రానికి అవార్డు ఇస్తామని వెల్లడించారు. నగరంలో ఉన్నటువంటి ఔత్సాహిక కళాకారులంతా ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనాలని కోరారు. ట్రెజరర్ కుమార్ రాజు మాట్లాడుతూ హాజరయ్యేవారు ఈ నెల 22వ తేదీలోపు రూ.500ను ప్రవేశ రుసుముగా చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 8919347875, 7569040211, 96427 07036, 9490098794 నెంబర్లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు దిలీప్ కుమార్, చిన్నారావు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

విశాఖలో ముజిగల్ మ్యూజిక్ అకాడమీ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దేశంలో అతిపెద్ద మ్యూజిక్ ఎడ్యుకేషన్ ప్లాట్‌ఫామ్‌గా ఉన్న ముజిగల్ తమ తొమ్మిదో అత్యాధునిక సంగీత అకాడమీని ఆదివారం విశాఖలోని ఎంవిపి డబుల్ రోడ్డులో ప్రారంభించింది. ఈ అకాడమీని సంగీత దర్శకుడు, గాయకుడు, సినీ దర్శకుడు ఆర్‌పి.పట్నాయక్, ముజిగల్ ఫౌండర్ డాక్టర్ లక్ష్మీనారాయణ ఏలూరి ప్రారంభించారు.

చంద్రబాబుకు రిమాండ్ విధించడం బాధాకరం

బైరా దిలీప్ చక్రవర్తి

ఎంవిపి.కాలనీ : టిడిపి అధినేత చంద్రబాబునాయుడుకు రిమాండ్ విధించడం బాధాకరమని బైరా ఫౌండేషన్ చైర్మన్ దిలీప్ చక్రవర్తి అన్నారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ న్యాయస్థానాలపై తమకు గౌరవం ఉందని, చట్టాన్ని తాము గౌరవిస్తామని చెప్పారు. ఈ కేసులో చట్టపరంగానే పోరాడతామని తెలిపారు. ఇలాంటి క్లిష్ట సమయంలో టిడిపి శ్రేణులు సంయమనంతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలంతా మనోధైర్యం కోల్పోకుండా, వైసీపీ ప్రభుత్వంపై పోరాడాలని సూచించారు. ఈ కేసులో చంద్రబాబు మిస్టర్ క్లీన్‌గా బయటికొస్తారని తెలిపారు.



మాట్లాడుతున్న దిలీప్ చక్రవర్తి

నిలిచిన పనులు

ఏడాదైనా పూర్తికాని మండల పరిషత్ సమావేశ భవనం

నిధులు మంజూరులో తీవ్ర జాప్యం

ప్రజాశక్తి -భీమునిపట్నం

నిధుల మంజూరులో తీవ్ర జాప్యం కారణంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో సుమారు ఏడాది క్రితం నిర్మాణం ప్రారంభమైన సమావేశ మందిర భవనం అర్ధాంతరంగా నిలిచింది. చీఫ్ మినిస్టర్ డెవలప్‌మెంట్ ఫండ్ (సిండిఎఫ్) నిధులు రూ.50 లక్షలు, హెచ్‌పిసిఎల్ నిధులు రూ.39 లక్షలలు కలిపి మొత్తంగా రూ.89 లక్షలతో భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. సుమారు 500 మంది కూర్చునేందుకు వీలుగా భవన నిర్మాణ పనులు చేపట్టారు. అయితే నిధుల విడుదలలో జాప్యం కారణంగా పనులు తొలి నుంచీ నత్త నడకన సాగాయి. ప్రతి మూడు నెలలకోసారి జరిగే మండల పరిషత్ సభ్యుల సాధారణ సమావేశంలో భవన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలంటూ స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మండల ఇంజినీరింగ్ అధికారికి ఆదేశాలు జారీ చేస్తూనే ఉన్నారు. సిఎండిఎఫ్ నిధులు మంజూరులో జాప్యం కారణంగా భవన నిర్మాణంలో జాప్యం నెలకొందని స్థానిక ఎమ్మెల్యేకు చెప్పడానికి సంబంధిత అధికారులు తటపటాయిస్తూ ఉండడం పరిపాటిగా మారింది. నిధులు విడుదల కానందున సకాలంలో పూర్తి కావడం లేదన్న వాస్తవాన్ని సంబంధిత అధికారులు దాచిపెట్టడం వల్లనే సమస్య నెలకొందన్న అభిప్రాయం పలువురు వ్యక్తపరుస్తున్నారు. నిధులు విడుదల చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లేందుకు ఎందుకు వెనుకాడు తున్నారనేది అసలు ప్రశ్న.



భీమిలిలో అర్ధాంతరంగా నిలిచిన మండల పరిషత్ సమావేశ భవన నిర్మాణ పనులు

ఇప్పటికైనా చీఫ్ మినిస్టర్ డెవలప్ మెంట్ ఫండ్ రూ.50 లక్షలు త్వరగా విడుదల చేసేందుకు ప్రయత్నాలు చేయాలి. హెచ్‌పిసిఎల్ విడుదల చేస్తామన్న రూ.39 లక్షల్లో, ఇప్పటి వరకు రూ 22 లక్షలు మంజూరయ్యాయి. ఆనందపురం, పద్మనాభం మండలాల్లో కూడా ఇదే తరహా భవనాల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. చెరో భవన నిర్మాణం నిమిత్తం చీఫ్ మినిస్టర్ డెవలప్‌మెంట్ ఫండ్ రూ.50 లక్షలతో 150 మంది కూర్చునే విధంగా మండల పరిషత్ కార్యాలయ సముదాయాల్లో సమావేశ మందిర భవనాల నిర్మాణం ఏడాది క్రితం ప్రారంభించారు. నిధులు విడుదల కాకపోవడంతో ఆయా మండలాల్లో కూడా అర్ధాంతరంగా భవనాల నిర్మాణ పనులు నిలిచిపోయాయి.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి -గాజువాక : న్యూపోర్టు పోలీసుస్టేషన్ పరిధిలో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటుచేసుకుంది. నడుపూరుకు చెందిన పీత గౌరీశ్వర్‌కుమార్ (25) నగరంలోని ఒక ప్రయివేటు బ్యాంకులో ఇంటి పత్రాలను తనఖా పెట్టి రూ.10 లక్షలు అప్పు తీసుకున్నాడు. ఈ అప్పుకు సంబంధించి ఆగస్టు నెలలో ఇఎమ్ఐ చెల్లించలేదు. దీంతో బ్యాంకు అధికారులు ఇంటికి వచ్చి రెండు రోజులుగా ఒత్తిడి చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం పెదగంట్యాడలోని ఒక హోటల్‌కు వెళ్లి గదిలో ఆత్మహత్య చేసుకున్నాడు. న్యూ పోర్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కుమారుడు మృతితో తల్లి లక్ష్మి బోరున విలపిస్తున్నారు.



చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అగ్రిగోల్డ్ ఏజెంట్లు

15న అగ్రిగోల్డ్ బాధితుల చలో విజయవాడ

ప్రజాశక్తి -ఆనందపురం : అగ్రిగోల్డ్ బాధితుల న్యాయ పోరాటానికి ఈ నెల 15 విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వస్తున్నట్లు ఏజెంట్స్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఆనందపురం కూడలిలో ఆదివారం చలో విజయవాడ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా అగ్రిగోల్డ్ ఏజెంట్‌లు కోరాడ ఆదినారాయణ, సన్యాసిరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో 32 లక్షల మంది కష్టార్జితాన్ని అగ్రిగోల్డ్ గజ దొంగలు దోచుకున్నారన్నారు. వీరి పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉండగా అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తానని మాట ఇచ్చి నేడు మడమ తిప్పారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని అభ్యర్థించారు. అనందపురం మండలంలో సుమారు పదివేల మంది బాధితులు సుమారు రూ.3 కోట్లు పైన అగ్రిగోల్డ్‌లో పెట్టుబడులు పెట్టారని తెలిపారు. ఈ 15న విజయవాడలో జరుగే భారీ బహిరంగ సభకు బాధితులందరూ హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్లు మీసాల నర్సింగరావు, బాలి రవికుమార్, దొంతల వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం కోసం కృషి

ప్రజాశక్తి -పిఎం.పాలెం : చిన్నతనం నుంచి లక్ష్యాన్ని ఏర్పరచుకొని, దాన్ని సాధించడానికి నిరంతరం కృషిచేయాలని వైసిపి కార్పొరేటర్ కంప హనోక్ అన్నారు. రేవళ్లపాలెం గ్రామానికి చెందిన పిళ్లా వాసుదేవరావు కుమారుడు పిళ్లా లక్ష్మీనారాయణ 2023 ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సాధించిన సందర్భంగా ఆదివారం ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పిఎం.పాలెం సమీపంలో ఉన్న డ్రాగన్ ఫిట్నెస్ సెంటర్ మాస్టర్ కనకారావు పర్యవేక్షణలో మూడు నిమిషాలలో లక్ష్మీనారాయణ 1000 పంచ్‌లు సాధించి ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సాధించాడు. ఇప్పటివరకు ప్రపంచ స్థాయిలో మూడు నిమిషాలలో 1085 పంచ్‌లు సాధించి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్ ఉందని, దానికి కేవలం 85 పంచులు దూరంలో లక్ష్మీనారాయణ ఉన్నాడని, త్వరలో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు కూడా సాధించాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కమేడియన్, మా అసోసియేషన్ మాజీ కార్యదర్శి వై.అప్పారావు, గ్రామస్తులు పాల్గొని లక్ష్మీనారాయణను అభినందించారు.



ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం పొందిన లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న కార్పొరేటర్ కంపా హనోక్ తదితరులు

బూత్ కమిటీలు ఏర్పాటు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రతి పంచాయతీలో జనసేన బూత్ కమిటీలు ఏర్పాటుచేయాలని పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి పంచకర్ల సందీప్ కార్యకర్తలకు సూచించారు. భీమిలిలో ఆదివారం జరిగిన రూరల్ మండల పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనంతో జనసేన పేరిట త్వరలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బూత్ కమిటీ నాయకులు ఇఎన్ఎస్.చంద్రరావు, ప్రచార కమిటీ నాయకులు కృష్ణయ్య, జి.కిరణ్, కె.శ్రీను, వెంకటేష్, సూరిరెడ్డి, గుర్నాయుడు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రీడింగ్ రూమ్ ప్రారంభం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో యువభారత్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన వివేకానంద రీడింగ్ రూమ్‌ను స్థానిక ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి విజయలక్ష్మి ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ శివరాణి, విశ్రాంత ఉపాధ్యాయులు కామేశ్వరరావు, యువ భారత్ వ్యవస్థాపకులు ఎల్లాజీరావు, భీమిలి శాఖ కన్వీనర్ ఎస్ జోగారావు, సోషల్ వర్కర్ వెంపాడ శ్రీనివాసరెడ్డి, పలువురు యువ భారత్ సభ్యులు పాల్గొన్నారు.



రీడింగ్ రూమ్‌ను ప్రారంభిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి విజయలక్ష్మి

పృథ్వీ బయోప్లాస్టిక్ ప్లాంట్ ప్రారంభం



ప్లాస్టిక్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్ తదితరులు

ప్రజాశక్తి -మధురవాడ : డిఆర్‌డిఒ సహకారంతో పృథ్వీ బయోప్లాస్టిక్ ప్లాంట్‌ను ఆదివారం రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎకో వైజాగ్‌కు మద్దతుగా ప్లాస్టిక్ రహిత ఉత్పత్తులకు ప్రోత్సాహం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నూతన విధానానికి నాంది పలికిందన్నారు. విశాఖలో ఇప్పటికే ప్లాస్టిక్‌ను నివారించడానికి అనేక కార్యక్రమాలు చేస్తున్నామని, వాటి ఫలితంగా అనేక అవార్డులు కూడా వచ్చాయని తెలిపారు. పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. సాగరంలో కొన్ని వేల టన్నులు చెత్త పేరుకుపోతోందని, వాటిని తొలగించేందుకు ప్రభుత్వం ప్రత్యేక యంత్రాలను దిగుమతి చేసేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, కంపెనీ సిఇఒ వి.పేరప్రసాద్, డిఆర్‌డిఒ ప్రాజెక్టు డైరెక్టర్, సైంటిస్ట్ ఎఫ్‌కె.వీరబ్రహ్మం, మాజీ డిప్యూటీ మేయర్ దొరబాబు, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నెమలిపురికి చోటు

ప్రజాశక్తి -తగరపువలస : "ప్రిజన్ రైటింగ్ డ్యూరింగ్ ఎమర్జెన్సీ ఇన్ ఇండియా – ఎ స్టడీ" అంశంపై పరిశోధన చేసిన సంగివలస అనిల్ నీరుకొండ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ నెమలిపురి సత్యనారాయణకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. ఇటీవల నగరానికి వచ్చిన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా విశాఖ పోర్టు ట్రస్ట్ అతిథి గృహంలో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డును డాక్టర్ నెమలిపురి అందుకున్నారు.

ఎయు ఆంగ్ల విభాగం రీసెర్చ్ గైడ్ ప్రొఫెసర్ చల్లా జయప్రద, కో గైడ్ ప్రొఫెసర్ రాజేంద్ర కర్మాకర్ ఆధ్వర్యాన చేసిన ఈ పరిశోధనకు గాను వీసీ పివిజిడి.ప్రసాదరెడ్డి చేతుల మీదుగా పిహెచ్‌డి కూడా అందుకున్నారు.

జైలు సాహిత్యంపై అధ్యయనం చేయడాన్ని జాతీయ స్థాయిలో సామాజిక బాధ్యత గలిగిన చర్యగా భావించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో తనకు చోటు దక్కిందని డాక్టర్ నెమలిపురి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మన దేశ, ప్రపంచ దేశాల జైలు సాహిత్యంపై అధ్యయనం చేయడం వల్ల ఇప్పటికే పశ్చిమ యూరోప్ దేశ విశ్వ విద్యాలయాల్లో ఒక ప్రత్యేక స్థానం లభించినట్లు తెలిపారు.



రాష్ట్ర గవర్నర్ ద్వారా అవార్డు అందుకుంటున్న డాక్టర్ నెమలిపురి

ప్రజల ఆకాంక్షను దెబ్బతీస్తే గుణపాఠం

ప్రజాశక్తి-ఉక్కునగరం : ప్రజల ఆకాంక్షలను దెబ్బతీసే ప్రభుత్వాలకు తగిన గుణపాఠం తప్పదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం కూడలిలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు ఆదివారం నాటికి 941వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ ఐఎన్‌టియుసి కాంట్రాక్టు కార్మికులు కూర్చున్నారు. ఈ దీక్షలనుద్దేశించి పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ జరిగితే ముందుగా నష్టపోయేది కాంట్రాక్టు కార్మికులేనని తెలిపారు. ఉత్పత్తిలో కలిసి పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్ కార్మికులు ఈ పోరాటంలో ముందుండి ప్లాంటును కాపాడుకుంటున్నారని తెలిపారు. పాలకులు ప్రయివేట్, బడా కార్పొరేట్లకు ప్రభుత్వ రంగ సంస్థలను కట్టబెట్టే ప్రయత్నంలో కార్మిక వర్గాన్ని ఆందోళన దిశగా నేడుతున్నారని విమర్శించారు. ఉక్కు పరిశ్రమపై ఆధారపడిన లక్షలాదిమంది ప్రజలు ఆందోళన చెందుతుంటే ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఉద్యమం ప్రారంభమై 941 రోజులు దాటుతున్నా రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు కేంద్రంపై ఒత్తిడి చేయకపోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుతనం కోసం మాట్లాడే నేతలు విశాఖ ఉక్కు పట్ల తమ వైఖరిని తెలపక పోవడం దురదృష్టకరమన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఇక్కడ యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరు చూస్తే ఆందోళనకరంగా ఉందన్నారు. ఈ ఏడాదైనా పూర్తి స్థాయిలో ఉత్పత్తి దిశగా ప్లాంటును నడవకపోతే స్థానిక యాజమాన్యానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసికి చెందిన వివిధ విభాగాల కాంట్రాక్ట్ కార్మికులు కూర్చున్నారు.


దీక్షలో కూర్చున్న స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు


ఐలమ్మ, రామకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ఐలమ్మ, రామకృష్ణకు నివాళి

ప్రజాశక్తి -గాజువాక : తెలంగాణ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ, విద్యుత్ ఉద్యమంలో అమరులైన రామకృష్ణకు గాజువాక స్వతంత్రనగర్ రజకవీధిలో ఆదివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ, తెలంగాణ పోరాటంలో ఐలమ్మ కీలక పాత్ర పోషించారన్నారు. రజక సంఘం ప్రధాన కార్యదర్శి రామకష్ణ విద్యుత్ ఉద్యమంలో గాయపడి సెప్టెంబర్ 8న మృతిచెందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం జిల్లా కార్యదర్శి కె.ఈశ్వరరావు, నాయకులు ఎం.విజయరావు తదితరులు నాయకత్వం వహించారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజు

చంద్రబాబు కేసులో బలంగా సాక్ష్యాధారాలు : అదీప్‌రాజు

ప్రజాశక్తి-పెందుర్తి : స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో సాక్షాధారాలతో చంద్రబాబు దొరికిపోయారని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ అన్నారు. రాంపురం వైసిపి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు అవినీతి చేసి దొరికిపోయారని తెలిపారు. తప్పు చేసిన ఎవరినీ ఈ ప్రభుత్వం వదలదని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గొర్లి రామనాయుడు, నరసింహమూర్తి, అంజి తదితరులు పాల్గొన్నారు.

కళా సాహితీ సంస్థ ఏర్పాటు

ప్రజాశక్తి- భీమునిపట్నం : కళలను, సాహిత్యాన్ని స్థానికంగా మరింతగా విస్తరించేందుకు కళా సాహితీ సంస్థను ఏర్పాటు చేసినట్లు రచయిత రాజేంద్ర ప్రసాద్‌వర్మ తెలిపారు. స్థానిక చిన్న బజారులోని ప్రైవేట్ కల్యాణ మండపంలో ఆదివారం పలువురు కళాకారులు, కళాభిమానులతో సమావేశం నిర్వహించారు. ప్రాచీన కళలను నేటి తరానికి పరిచయం చేస్తూనే, పేద కళాకారులను అన్ని విధాలా ప్రోత్సహించనున్నట్లు వర్మ వివరించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏర్పాటుచేశారు. గౌరవాధ్యక్షులుగా ఆర్.అప్పలనరసయ్య, అధ్యక్షులుగా పిఆర్‌పి.వర్మ, కార్యదర్శిగా ఎ.సన్యాసిరాజు, కోశాధికారిగా, కాళ్ళ సన్నీ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎం.సూర్యశ్రీనివాస్, సలహాదారులుగా కె.రమానాయుడు, పిట్టా సురేష్ ఎన్నికయ్యారు. అలానే కళలు, సాహిత్యం, నృత్యం ఇలా విభాగాల వారీగా ప్రతినిధులను ఎన్నుకున్నారు.

శేషుపాలేనికి కల్వర్టు నిర్మించాలి

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం శోంత్యాం పంచాయతీ శేషుపాలెం గ్రామానికి కల్వర్టు నిర్మించాలని జనసేన నాయకులు కోరారు. జనసేన నాయకులు కోరుకొండ మూర్తి తదితరులు గ్రామంలో పర్యటించి పలు సమస్యలను గుర్తించారు. గ్రామం సమీపంలో ఉన్న పెద్ద చెరువు నుంచి వచ్చే వాగు దాటుకుంటూ గ్రామంలోకి వెళ్లాల్సి ఉంటుందని, చెరువు వాగు వద్ద కల్వర్టు నిర్మించాలని అనేకసార్లు విన్నవించుకున్నా అధికారులు స్పందించడం లేదని గ్రామస్తులు, జనసేన నాయకులు విమర్శిస్తున్నారు. వర్షాకాలంలో పెద్ద చెరువు వాగును దాటేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కల్వర్టు లేకపోవడంతో ఆ గ్రామంలో నివసించలేక ఇళ్లు వదులుకొని హైవేకు దగ్గరగా వచ్చి అద్దెనివాసాల్లో ఆ గ్రామ ప్రజలు జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. కొన్ని రోజుల క్రితం విద్యుత్ సరఫరాను కూడా నిలిపివేశారన్నారు. వెంటనే ఆ గ్రామానికి కల్వర్టు నిర్మించి, రోడ్లు, విద్యుత్, తాగునీరు సౌకర్యం కల్పించాలని కోరుకొండ మూర్తి డిమాండ్ చేశారు.

ట్రాఫిక్ సమస్యపై సిపిఎం ధర్నా


బాజీ జంక్షన్లో ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి -గోపాలపట్నం : గోపాలపట్నం సమీపంలోని బాజీ జంక్షన్‌లో ట్రాఫిక్ నిబంధనల పేరుతో ప్రధాన రహదారికి ఒకవైపు భారికేడ్లను పెట్టడంతో తలెత్తుతున్న ఇబ్బందులపై సిపిఎం గోపాలపట్నం జోన్ కమిటీ ఆధ్వర్యాన ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం గోపాలపట్నం జోన్ కార్యదర్శి బలివాడ వెంకటరావు మాట్లాడుతూ, బారికేడ్లు పెట్టడం వల్ల బుచ్చిరాజుపాలెం, చినబుచ్చిరాజుపాలెం, బాజీ జంక్షన్, ఎస్సీ కాలనీ, పాత గోపాలపట్నం, శ్రీనివాసనగర్, లక్ష్మీనగర్‌కు చెందిన వేలాదిమంది రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడిందని తెలిపారు. దీనిపై తక్షణమే పోలీసులు దృష్టి సారించి బారికెడ్లు తొలగించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేయాలని కోరారు. అనంతరం ఎయిర్‌పోర్టు సిఐ ఎం.అప్పారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వి.ప్రభావతి, పి.అనసూయ, ఎస్.సత్యవేణి, పి.సత్యనారాయణ. ఎస్.సత్యనారాయణ, ఆర్.శ్రీనివాసరావు, ఎం.అన్నపూర్ణ, పి.ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 96వ వార్డు పరిధి జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎమ్.కాలనీలో ఐదేళ్ల బాలికపై అభిషేక్ (18) అలియాస్ నాని అత్యాచారానికి పాల్పడినట్లు బాలిక తల్లిదండ్రులు పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం కాలనీలో పైబ్లాకు, కింది బ్లాకుల్లో నిందితుడు, బాలిక కుటుంబాలు నివసిస్తున్నాయి.

తల్లిదండ్రులు ఇంటికి వచ్చాక అభిషేక్ ఇలా చేశాడని బాలిక చెప్పింది. దీంతో అత్యాచారం జరిగినట్లు తల్లిదండ్రులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదుచేశారు. నిందితుడు అభిషేక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వైద్య పరీక్షల నిమిత్తం బాలికను కెజిహెచ్‌కు పంపినట్లు సిఐ శ్రీనివాసరావు తెలిపారు. వైద్య పరీక్షల రిపోర్టుల ఆధారంగా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.

విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు

ప్రజాశక్తి -గాజువాక : జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యాన రవీంద్ర ఇండియన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఆదివారం విద్యార్థులకు ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. 100 మంది విద్యార్థులకు, పెద్దలకు ఉచిత దంత పరీక్షలు నిర్వహించారు. దంత సంరక్షణ చర్యలను డాక్టర్ కుందన విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జెసిఐ వైజాగ్ ఎక్సలెన్స్ బజ్ ప్రెసిడెంట్ శిరీష, ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ సుధాలలిత, అవినాష్, మురళీధర్, రవి, సుందర్ పాల్గొన్నారు.


విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

75 మంది రక్తదానం

ప్రజాశక్తి ఆనందపురం : ఆనందపురం మండలం మామిడిలోవ గ్రామంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో 75 మంది రక్తదానం చేశారు. శ్రీ సత్యసాయి బాబా సేవా సమితి ఆధ్వర్యాన ఎఎస్ రాజా వాలంటరీ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో మామిడిలోవ, ఆ పరిసర గ్రామాల యువత, మహిళలు, ఎఎస్.రాజా బ్లడ్‌బ్యాంక్ డాక్టర్ కె.ప్రవీణ్, శ్రీసత్యసాయి సేవా సంస్థ గ్రామ ఇన్‌ఛార్జి బి.పెంటయ్య, బి.అప్పలరాము, సంతోష్, సాయికుమార్, వేణుగోపాల్, రాఘవరావు, సత్యసాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వనరులు కాపాడుకోవాలి


మట్టి వినాయక ప్రతిమలతో అధ్యాపకులు, విద్యార్థులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రకృతి వనరులను కాపాడుకోవాలని గ్రీన్ క్లైమేట్ టీమ్ వ్యవస్థాపక కార్యదర్శి జెవి.రత్నం ప్రజలకు పిలుపునిచ్చారు. స్థానిక కెజిబివిలో ఆదివారం గ్రీన్ క్లైమేట్ టీమ్ ఆధ్వర్యాన మట్టి వినాయక ప్రతిమలను ప్రదర్శించారు. 21 వినాయక పత్రి మొక్కలను పెంచుదాం, ఏకో వైజాగ్‌ను జయప్రదం చేద్దాం అని ఉపాధ్యాయులు, విద్యార్థులు నినదించారు. ఈ సందర్భంగా జెవి.రత్నం మాట్లాడుతూ, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన ప్రతిమల వల్ల మానవాళికి, జీవ వైవిధ్యానికి హాని కలుగుతుందన్నారు. భారత కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాల ప్రకారం ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తోగాని, కెమికల్ పెయింట్లతోగాని ప్రతిమలను రూపొందించరాదని తెలిపారు. గాలి, నీరు, భూమిని ఆరోగ్యకరంగా ఉంచితే మనం కూడా ఆరోగ్యకరంగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ టీమ్ ప్రతినిధులు రాజేశ్వరి, రవితేజ, ప్రిన్సిపల్ గంగాకుమారి తదితరులు పాల్గొన్నారు.

సన్యాసిరావుకు డాక్టరేట్

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం బంటుపల్లి వారి గ్రామ పంచాయతీకి చెందిన డాక్టర్ పిన్నింటి సన్యాసిరావుకు బ్యాంకింగ్ రంగంలో పరిశోధనకు గాను ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టరేట్ అందజేసింది. బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగస్తులు, వినియోగదారుల ఆలోచన సరళిపై చేసిన పరిశోధనకు గాను స్నాతకోత్సవంలో ఎయు వీసీ పివిజిడి ప్రసాద్‌రెడ్డి ద్వారా డాక్టరేట్ అందుకున్నారు.


సన్యాసిరావుకు డాక్టరేట్‌ను అందిస్తున్న వీసీ

సమగ్ర శిక్ష, కెజిబివి కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి

వేడుకోలు నిరాహారదీక్ష

సంఘీభావం తెలిపిన సిఐటియు, యుటిఎఫ్, పిఆర్‌టియు



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకరరావు

ప్రజాశక్తి -అనకాపల్లి : సమగ్రశిక్ష, కెజిబివిల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకరరావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గొంది చిన్నబ్బాయి, పిఆర్‌టియు నాయకులు గోపీనాథ్ డిమాండ్ చేశారు. తమ సమస్య పరిష్కారానికి ఆదివారం అనకాపల్లి ఎన్‌టిఆర్ స్టేడియం వద్ద తాత్కాలిక ఉద్యోగుల చేపట్టిన 'వేడుకోలు నిరాహార దీక్ష'కు సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వశాఖలు, విద్యాసంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయాలన్నారు. ఉద్యోగుల వేతనాలు పెంచి 15 నెలలు గడుస్తున్నా, సమగ్ర శిక్ష ఉద్యోగులకు వర్తింపజేయకపోవడం దారుణమన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. దీనిపై నాలుగేళ్లుగా అధికారులు, మంత్రులు, ప్రభుత్వ పెద్దలకు ఎన్నోసార్లు విన్నవించినా స్పందన లేకపోవడం దారుణమన్నారు.

అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చి, కనీస వేతనాలు అమలు చేయాలని, పార్టుటైం విధానాన్ని రద్దు చేసి, ఆ పద్ధతిలో పనిచేస్తున్న వారిని ఫుల్‌టైం కాంట్రాక్టు కార్మికులుగా గుర్తించాలని, వీరికి వేతనాలను పెంచాలని, డిఎ, హెచ్‌ఆర్‌ఎ, రూ.10లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్, గ్రాట్యుటీ, ఇతర సామాజిక భద్రత పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవులు, మెరుగైన హెల్త్‌స్కీం అమలు, ఖాళీ పోస్టుల భర్తీ, వడ్డీ లేని బ్యాంకు రుణాలు ఇవ్వాలని, కారుణ్య నియమాలు చేపట్టాలని, మహిళా ఉద్యోగులకు చైల్డ్‌కేర్ సెలవులు మంజూరు, అన్ని పోస్టులకు కచ్చితమైన జాబ్‌చార్ట్, ప్రతినెలా ఒకటో తేదీన వేతనం, ఇతర సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెఎసి నేతలు వివి శ్రీనివాసరావు, బొడ్డేడ అచ్యుత్ కృష్ణ, వెంకటరావు, ఎస్‌సి, ఎస్‌టి టీచర్స్ యూనియన్ నాయకులు ఎం.శ్రీనివాసరావు, జి.నాగేశ్వరరావు, సిహెచ్.రామచంద్ర, వరప్రసాద్, సంతోష్, పరదేశి, జి శ్రీనివాసరావు, నాయుడు పాల్గొన్నారు.

నాగజగదీష్ గృహ నిర్బంధం



పోలీసులు గృహనిర్బంధం చేసిన నాగజగదీష్

ప్రజాశక్తి -అనకాపల్లి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబును అన్యాయంగా అరెస్టు చేశారంటూ నిరసనగా రాష్ట్ర అధ్యక్షులు కింజరపు అచ్చెన్నాయుడు బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆదివారం రాత్రి తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావును అనకాపల్లి పట్టణ పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఇల్లు విడిచి వెళ్ళవద్దని నోటీసులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాల్లో 144 సెక్షన్ అమలులో ఉన్నందున దానికి అనుగుణంగా నడుచుకోవాలని, సభలు, సమావేశాలు, గుంపులుగా ర్యాలీలు, ప్రదర్శనలు నిషిద్ధమని పోలీసులు హెచ్చరించారు.

బంద్ విజయవంతం చేయండి

టిడిపి అధినేత చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించిన నేపథ్యంలో అనకాపల్లి జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో ఇన్‌ఛార్జిలు బాధ్యత తీసుకొని బంద్ నిర్వహించాలని అనకాపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ బంద్‌కు వ్యాపార సంస్థలు విద్యాసంస్థలు ప్రజలు కార్మికులు కర్షకులు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని నాగ జగదీష్ విజ్ఞప్తి చేశారు. కాగా విధించారంటే ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడానికి, ప్రతిపక్షాలను భయపెట్టడానికి, రాష్ట్రంలో ఎమర్జెన్సీని తలపించే విధంగా ఉందన్నారు. తెలుగుదేశం పార్టీకి ప్రజాదరణ పెరుగుతుందే తప్ప తెలుగుదేశం శ్రేణులు పోరాట కసిని పెంచారని నాగ జగదీష్ అన్నారు.

211 మందికి ఉచిత వైద్యసేవలు



రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : అమ్మానాన్న సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అచ్యుతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎస్ఐ సన్యాసినాయుడు ప్రారంభించారు. . కేర్ హాస్పిటల్ వైద్య బృందం పాల్గొని 211మందిరోగులను పరీక్షించారు. శిబిరానికి వచ్చిన రోగులకు బిపి, సుగర్, ఇసిజి, తదితర వ్యాధినిర్ధారణ పరీక్షలు చేశారు. అనంతరం నివేదికల ఆధారంగా రోగుల ఆరోగ్య పరిస్థితిని వివరించారు. కార్యక్రమంలో అమ్మానాన్న సేవా సంఘం వ్యవస్థాపకులు కర్రి నాగేశ్వరరావు, సంఘ కార్యదర్శి పింకే చంటిబాబు, బిసి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వడిసెల శ్రీనివాసరావు ఎంపిటిసి లాలం శ్రీనివాస్, కర్రి అప్పారావు, కర్రి రమణ, గద్దెడ నూకరాజు, కేర్ ఆసుపత్రి మేనేజర్ ఆల్ఫా బ్రైట్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ జి సంతోష్‌రామ్ పాల్గొన్నారు. వైద్య శిబిరానికి మోసయ్యపేట, చౌడపల్లి, రామన్నపాలెం, అచ్యుతాపురం పంచాయతీల రోగులు సద్వినియోగం చేసుకున్నారు.

దళిత హక్కుల పరిరక్షణ ధ్యేయం

ప్రజాశక్తి- కె.కోటపాడు : దళితుల ఐక్యత, వారి హక్కుల పరిరక్షణే ధ్యేయంగా మాల మహానాడు పనిచేస్తోందని ఉత్తరాంధ్ర అధ్యక్షుడు గొర్రె ఈశ్వరరావు అన్నారు. ఆదివారం కోటపాడులో నిర్వహించిన మాలల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులు. హత్యలపై తీవ్రంగా స్పందించారు. పెండింగ్‌లో ఉన్న ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులను తక్షణమే పరిష్కరించాలని, అత్యాచార నిరోధక చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి బోనాల అప్పారావు మాట్లాడుతూ దళితులను ఏకతాటిపైకి తేవడానికి, వారి హక్కుల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో దళిత నాయకులు కె అప్పలనరసమ్మ. కోకిలాల సాయిసుందరి, బి విష్ణు, కాకర క్రాంతికుమార్, నాగభూషణం, 32 పంచాయతీల దళితులు పాల్గొన్నారు.

సమిష్టి పనితత్వంతో అభివృద్ధి సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఐనాక్

ప్రజాశక్తి -చోడవరం : సమాజంలో సాంఘిక, ఆర్థిక అసమానతలు తొలగితేనే సమానత్వం సాధ్యమౌతుందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, మాజీ ఉప కులపతి పద్మశ్రీ, ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. సమిష్టిగా పనితత్వంతో అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఆదివారం స్థానిక ప్రేమ సమాజంలో నన్నయ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాలకు చదువు అందుబాటులో ఉండాలన్నారు. అట్టడుగు వర్గాల్లో నుంచి రావడం వలే తాను రాసిన కవితలన్నీ సామాజిక దృక్పథం కోణంలో ఉంటాయన్నారు.

కార్యక్రమంలో ఆర్‌కె.ప్రసాద్, దేవుడు, వరప్రసాద్, వెంకటరావు, సియ్యాద్రి శ్రీనివాసరావు, స్వామి ప్రకాశరావు, అప్పారావు, సత్యం, శేషగిరి, ఈశ్వరరావు, విశ్వనాథ, దేముడు, కృష్ణప్రసాద్, అనిల్, రాజశేఖర్, దివాకర్ పాల్గొన్నారు

స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం సూత్రధారి చంద్రబాబే!

వైసిపి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్



మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

ప్రజాశక్తి -అనకాపల్లి : స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌కు ప్రధాన సూత్రధారి చంద్రబాబు చట్టాలకు అతీతుడా అని వైసిపి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ప్రశ్నించారు. ఆదివారం స్థానిక రింగ్ రోడ్‌లోని మంత్రి అమర్ క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, యువతకు నైపుణ్యాభివృద్ధి సంస్థ పేరుతో రూ.371 కోట్ల ప్రజాధనాన్ని చంద్రబాబు లూటీ చేశారన్నారు. ఈ కుంభకోణాన్ని బిజెపి జనసేన టిడిపి నాయకులు ఖండించకపోవడం శోచనీయమన్నారు. ఈ వ్యవహారంలో చంద్రబాబు అవినీతిపై దర్యాప్తు జరపాలని 2018లో పవన్ కల్యాణ్ డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం అరెస్టుపై మాట్లాడని పవన్, ఇపుడు చంద్రబాబు అరెస్టుపై గగ్గోలు పెట్టడం తగదన్నారు.ఎపిడబ్ల్యుఐఎ రాష్ట్ర చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తే కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. చట్టం ముందు అందరూ సమానులేరని, తప్పు చేసిన వారెవరైనా శిక్ష అనుభవించక తప్పదన్నారు. వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, ఎంపిపి గొర్లి సూరిబాబు, మళ్ల బుల్లిబాబు, జాజుల రమేష్, బొడ్డేడ శివ, సకల గోవింద, పెద్దిశెట్టి గోవింద పాల్గొన్నారు

ప్రతిపక్షాలపై కక్ష సాధింపు తగదు

ప్రజాశక్తి- మునగపాక రూరల్: ప్రతిపక్ష పార్టీలపై అధికార వైసిపి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి సుందరపు విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం జనసేన కార్యాలయంలోమాట్లాడుతూ దేశంలో ప్రతిష్టాత్మక జి20 సదస్సు జరుగుతున్న వేళ ఇలాంటి కక్షసాధింపు చర్యలు, అక్రమ అరెస్టులు ఏంటని అధికార పార్టీపై మండిపడ్డారు. శనివారం రాత్రి మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయానికి పవన్ కల్యాణ్ వస్తుంటే పోలీసులు అడ్డంకులు సృష్టించడం ప్రతిపక్షాల గొంతు నొక్కడమేనన్నారు. ప్రజలంతా గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో తప్పక గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో మునగపాక మండల పార్టీ అధ్యక్షులు టెక్కలి పరశరాం, ꠰ చంద్రమోహన్, మొల్లేటి ఆనంద్, సరోజిని పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఉపముఖ్యమంత్రి

ప్రజాశక్తి- దేవరాపల్లి: మండలకేంద్రంలో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయం -2 భవనాన్ని ఉపముఖ్యమంత్రి మంత్రి బూడి ముత్యాలనాయుడు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పాలనను ప్రజలకు చేరువ చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిందని, వాటిని లక్షలాది రుపాయలతో సొంత వసతులు, సౌకర్యాలను కల్పిస్తోందన్నారు. సచివాలయం -1 భవనాన్ని కూడా పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని మంత్రి బూడి సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి, జెడ్‌పిటిసి కర్రి సత్యం, మాజీ ఎంపిపి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు కిలపర్తి భాస్కరరావు, మండల పార్టీ అధ్యక్షులు బూరె బాబూరావు, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ సింహాచలంనాయుడు, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపిటిసి మొల్లి కృష్ణమూర్తి, జెఎస్‌సి మండల కన్వీనర్ కెవిరమణ, ఎంపిడిఒ జివి.రమణ, ఊర్రుకుల అప్పారావు, గుల్లిపల్లి మురళి, గొర్లె సన్యాసినాయుడు, వాలేటి నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సత్యసాయి ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షల వితరణ

మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న పార్కుకు ఆనుకొని ఉన్న ఖాళీస్థలంలో సత్యసాయి ఆలయం నిర్మాణానికిఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు శంకుస్థాపన చేశారు. సత్యసాయి సేవా సమితి సభ్యుల కోరిక మేరకు సత్యసాయి మందిరానికి స్థలాన్ని కేటాయించిన మంత్రి, ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షల సాయం అందిస్తానని హామీ ఇచ్చారు.

కళాకారులకు సత్కారం



కళాకారులను సత్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని నెల్లిపూడి గ్రామంలో తాడిపెద్ది అచ్చు కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సర్పంచ్ సురేష్ వర్మ, వైసిపి నాయకులు మణి రాజు, పాపారావు, లోడగల చంద్రరావు తదితరులు పాల్గొన్నారు. డి ఎల్ పురం మాజీ ఎంపిటిసి సభ్యులు గింజాల వెంకటరమణ, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు ఎం. రాజేష్ తదితరులు తప్పెటగుళ్ళు కళాకారులను సత్కరించారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

షార్ట్ సర్క్యూట్‌తో లారీ దగ్ధం



దగ్ధమౌతున్న లారీ మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

ప్రజాశక్తి - యలమంచిలి : మండలంలోని పురుషోత్తపురం గ్రామం వద్ద జాతీయ రహదారి 16పై కెమికల్ లోడుతో వెళ్తున్న లారీ ఆదివారం ఉదయం దగ్ధమైంది. కెమికల్ లోడుతో అచ్యుతాపురం నుంచి హైదరాబాదు వెళ్తున్న ఎపి 07 టిఎన్2719 టాటా అల్ట్రా వాహనానికి మంటలు రాజుకోవడంతో సమాచారం అందుకున్న రూరల్ ఎస్.ఐ.సన్నిబాబు ఆధ్వర్యంలో పోలీసులు, ఫైర్ ఆఫీసర్ డి.రాంబాబు ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని మంటల్ని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే లారీ పూర్తిగా కాలిపోయింది. షార్టుసర్క్యూట్ ప్రమాదానికి కారణమని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ఈ ప్రమాదంలో రూ.9.50 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు.

ఘనంగా దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి గ్రామంలో ఆంజనేయ స్వామి గుడి సమీపంలో దుర్గాదేవి విగ్రహాన్నిఆదివారం స్థానికులు ప్రతిష్టించారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి దొండ రాంబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికులు సహకారంతో అన్నసమారాధన నిర్వహించినట్లు నిర్వాహకులు మామిడి సంజీవ్ తెలిపారు.

విద్యుదాఘాతంతో గొర్రెల మృతి



మృత్యువాత పడ్డ గొర్రెలు

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని వేంపాడులో విద్యుత్ షాక్ గురై 4 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. అల్లు అప్పారావుకు చెందిన గొర్రెల మందలో 4 గొర్రెలు మేత మేస్తుండగా ఆదివారం ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభం వద్ద కరెంట్ వైర్ తగలడంతో షాక్ గురై అక్కడికక్కడే గొర్రెలు మృత్యువాత పడ్డాయి. గొర్రెల మృతితో 80 వేల రూపాయలు నష్టం వాటిల్లినట్లు అల్లు అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు .

పూడికలతో 'పెంజెరువు'

- ఆయకట్టు భూములకు అందని సాగునీరు
- వరినాట్లు పడక బీడులుగా పంటపొలాలు
- పట్టించుకోని అధికారులు, నేతలు
- ఆవేదన చెందుతున్న అన్నదాతలు



పూడికలతో నిండి ఉన్న 'పెంజెరువు'

ప్రజాశక్తి - యలమంచిలి : శారదానది పొరిందంటే పెంజెరువు నిండినట్టే భావించేవారు ఒకప్పుడు.కానీ ప్రస్తుతం పరిస్థితి వేరు. నదిలో నిండుగా నీరు పారుతున్నా పెంజెరువుకు చుక్కసాగునీరు చేరని పరిస్థితి ఉంది. గతంలో ఖరీఫ్ మొదలవగానే స్థానిక రైతులు పంటకాలువ పూడికలు తీయడానికి పూనుకొనేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. అంతా ప్రభుత్వమే చెయ్యాలని ఎదురుచూస్తూ, కాలువ పనులు సొంతంగా చేసుకోవడం మానేశారు. నిధులు లేవంటూ జలవనరుల శాఖ కాలువలను పట్టించుకోవడం ఎప్పుడో మానేసింది. ఫలితంగా ఈ చెరువు పరిధిలోని ఆయకట్టు భూములకు సాగునీరు ప్రశ్నార్థకమై, పంటలు గాల్లో దీపంలా మారాయి.

యలమంచిలి పట్టణానికి సహజ నీటి వనరు 'పెంజెరువు'. సుమారు 70 ఎకరాల చెరువు గర్భానికి ఆక్రమణలు పోగా, ప్రస్తుతం 56 ఎకరాలు మాత్రమే మిగిలింది. ఈ చెరువు కింద సుమారు 600 ఎకరాలు ఆయకట్టు ఉంది. అయితే ఏళ్ల తరబడి చెరువులోని పూడికలు తీయడం గానీ, దాని అభివృద్ధి, ఇతర నిర్వహణ పనులను చేసే దిక్కు లేకపోవడంతో ఆయకట్టు భవిష్యత్తు అగమ్యగోచరమైంది. అయితే ఈ చెరువులో అనధికారికంగా చేపలు పెంపకం జరుగుతోంది. దాని మూలంగా సుమారు రూ.6లక్షల ఆదాయం వస్తోందని అంచనా. ప్రభుత్వపరంగా అధికారులు స్పందించని పరిస్థితి ఉండగా, మరోవైపు అనధికారికంగా సమకూరిన ఆదాయంతోనైనా కొంతమేర ఖర్చు చేసి, కాలువ పనులు చేసినట్లు తెలిసింది. సకాలంలో కాలువ మరమ్మత్తు పనులు చేపట్టకపోవడంతో ఆయకట్టు భూములకు సాగునీరు అందక బీడులుగా మిగిలిపోయాయని కొందరు రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గానీ, చేపలు పెంపకందారులైనా చెరువులోని పూడికతీతకు చర్యలు తీసుకోవడం ద్వారా ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

పూడికలతో సాగునీరు ప్రశ్నార్థకం



ఆనకట్ట వద్ద పంటకాలువ పూడికపోవడంతో సాగునీరు పారడం లేదు. ఎప్పుడూ రైతులే సొంతంగా బాగుచేసుకోవడమే తప్ప, ఇరిగేషన్ అధికారులు పట్టించుకునే పరిస్థితి లేదు.దీంతో ఆయకట్టు సాగు ప్రశ్నార్థకమైంది. ఈ ఏడాది పంట కాలువ పూడిక తీయాలని మున్సిపాలిటీలో ప్రస్తావించాం. నిధులిస్తే పనులు చేపడతాం.
బెజవాడ నాగేశ్వరరావు, వైస్ చైర్మన్, మున్సిపాలిటీ

బ్రాండిక్స్ ఆధ్వర్యాన 350 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న శంకర్‌ఫౌండేషన్ సిబ్బంది

ప్రజాశక్తి -అచ్యుతాపురం : బ్రాండిక్స్ అపెరల్ సిటీ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 113వ ఉచిత కంటి వైద్య శిబిరంలో 350 మందికి విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వైద్యులు పరీక్షించారు. వైద్య శిబిరానికి 700మంది హాజరు కాగా, 350 మందికి కంటిచూపు పరీక్షలు నిర్వహించి, వారిలో 232 మందికి ఉచితంగా కంటి అద్దాలను. 66మందికి మందులు పంపిణీ చేశారు. 40మందిని కాటరాక్ట్ ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. అలాగే రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో బ్రాండిక్స్ నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరంలో 15 మంది యువకులు రక్తదానం చేశారు. శిబిరానికి వచ్చిన రోగులకు మజ్జిగ, అల్పాహారం, భోజన సదుపాయం కల్పించారు.

విద్యుత్ స్తంభాలపై పాకిన పాదులు

వైర్లు పైనుంచి వేలాడుతున్న పిచ్చిమొక్కల తీగలు
ప్రమాదభరితంగా ఉన్నా పట్టించుకోని విద్యుత్ సిబ్బంది

ప్రజాశక్తి - వడ్డాది : బుచ్చయ్యపేట మండలం ఎల్‌బిపి అగ్రహారం వాటర్ ట్యాంక్ ఎదురుగా మెయిన్ రోడ్డు ఆనుకొని ఉన్న విద్యుత్ స్తంభాలకు భారీగా పాదులు ఎక్కి ప్రమాదభరితంగా మారినా పట్టించుకునే దిక్కులేదని స్థానికులు వాపోతున్నారు. పిచ్చిమొక్కలు తీగలు స్తంభాన్ని చుట్టుకుంటూ పాకి, ఏకంగా వైర్లను కమ్మేసి, అక్కడ విద్యుత్‌స్తంభం, కరెంటు వైర్లు కనిపించనంతగా చెట్టుగా మారిపోయినా విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బందికి కనిపించడం లేదాయని పలువురు ప్రశ్నిస్తున్నారు. రహదారి గుండా రాకపోకలు సాగించే పాదచారులు, వాహనదారులు కొందరు చెట్టుగా మారిన కరెంటు స్తంభాన్ని ఆశ్చర్యంగా తిలకిస్తున్నారు. విద్యుత్ స్తంభం, వైర్లు మీదుగా పాకిన పాదులు, ఆ పక్కనే ఉన్న చింతచెట్టును కూడా చుట్టేసి అక్కడా కిందకి వేలాడుతున్నాయి..ఆ చెట్టు కింద నుండి నడిచి వెళ్లే వారి తలకు తగిలేంతగా ఈ తీగలు పెరిగిపోయాయి.



విద్యుత్ స్తంభం, వైర్లుపై వేలాడుతున్న పాదులు

విద్యుత్ స్తంభాలను కమ్మేసిన పాదుల వల్ల వర్షం కురిస్తే విద్యుత్‌కు అంతరాయం కలిగే, తడిగా ఉన్నప్పుడు దీని కిందుగా వెళితే ఎక్కడ షాక్ కొట్టి ప్రాణాపాయం కలుగుతుందోనని అటుగా వెళ్లేవారు భయాందోళనకు గురౌతున్నారు. హెచ్‌టి లైన్ విద్యుత్ వైర్లు కావడంతో వర్షం పడేటప్పుడు ఇక్కడ నిప్పులు పడుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, సిబ్బంది స్పందించి, కరెంటు స్తంభాలపై పాకిన పాదులను తొలగించి, ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.

15 నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే

ప్రజాశక్తి - యలమంచిలి : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15 నుంచి 30 వరకు సర్వే చేపట్టి, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గుర్తించి ఎఎన్ఎంలు నమోదు చేస్తారని ఎంపిడిఒ అప్పలనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆరోగ్యశ్రీ సేవలపై అవగాహన, ప్రచార శిబిరాలు నిర్వహిస్తారన్నారు. దీనికి సంబంధించి ఈనెల 12నాటికి ఎఎన్ఎంలకు శిక్షణనిస్తారన్నారు. 15 నుంచి నిర్వహించే సర్వేలో ఆరోగ్యశ్రీపై కరపత్రాల ప్రచారం, ఈనెల 30న జగనన్న ఆరోగ్య సురక్ష తొలి వైద్యశిబిరం నిర్వహిస్తామన్నారు. అక్కడ నుంచి రోజువిడిచి రోజు జగనన్న ఆరోగ్యశిబిరాలను స్పెషలిస్ట్ వైద్యుల పర్యవేక్షణలో నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య సురక్ష విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో 139 రకాల వ్యాధులకు చికిత్స చేస్తారని, మెరుగైన వైద్యం అవసరమైన వారికి రిఫరల్ ఆసుపత్రికి పంపి, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా ఉచిత వైద్యం అందిస్తారన్నారు.

చట్టం తన పని తాను చేసింది : బూడి

ప్రజాశక్తి- దేవరాపల్లి : చట్టానికి ఎవరూ అతీతులు కారని, అంతిమంగా న్యాయమే గెలుస్తుందని, తప్పు చేసిన వారు ఎవరూ తప్పించుకోలేరని డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, 2014లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు స్కిల్ డెవలప్మెంట్ స్కాంకు తెర తీశారన్నారు. చంద్రబాబు తప్పు చేశారని ఆధారాలు లభించిన తర్వాతే సిఐడి అరెస్ట్ చేసిందని, న్యాయస్థానం 14 రోజులు రిమాండ్ విధించిందన్నారు. చట్టం తన పని తాను చేసుకుపోతోందని వ్యాఖ్యానించారు.

ఆలయ ముఖద్వార నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -మునగపాక రూరల్: మండలంలోని మూలపేట గ్రామంలో గంగాలమ్మ దేవాలయ ముఖద్వారం నిర్మాణానికి వైసిపి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఇటీవల పాముకాటుతో మృతి చెందిన మొల్లేటి శంకరగణేష్ జ్ఞాపకార్థం దీన్ని నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భీశెట్టి గంగ అప్పల నాయుడు, ఎంపిటిసిలు కాండ్రేగుల వెంకటలక్ష్మి, మద్దాల వీరునాయుడు, ఉపసర్పంచ్ మొల్లేటి దేవిచంద్ర, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొడ్డేడ చెల్లయ్య నాయుడు, వైసిపి నేతలు దొడ్డి కోటేశ్వరరావు, గ్రామ పెద్దలు ఆడారి కాశీరావు, శరగడం నాగేశ్వరరావు, కాండ్రేగుల ఈశ్వర అప్పారావు, భీశెట్టి మధు, కాండ్రేగుల నాగేశ్వరరావు, భీశెట్టి వీరునాయుడు, బొడ్డేడ రవికుమార్ పాల్గొన్నారు.

వాడవాడలా టిడిపి నిరసన దీక్షలు



గోపాలపట్నంలో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు

- నల్ల జెండాలతో పలు చోట్ల ఆందోళనలు - తక్షణమే బాబును విడుదల చేయాలి

ప్రజాశక్తి-యంత్రాంగం: **మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ విశాఖ, అనకాపల్లి జిల్లాలోని టిడిపి శ్రేణులు నిరాహార దీక్ష చేపట్టారు. చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారని, తక్షణమే విడుదల చేయాలని నాయకులు నినాదాలు చేశారు.**

అనకాపల్లి :స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబుపై సిఎం జగన్‌రెడ్డి కక్షపూరిత చర్యలకు పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్సీ, టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీల గోవింద సత్యనారాయణ వేర్వేరు శిబిరాల్లో మండిపడ్డారు. ఆదివారం చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ రింగ్ రోడ్‌లోని పార్లమెంటరీ పార్టీ కార్యాలయం వద్ద చేపట్టిన దీక్ష శిబిరంలో నాగ జగదీష్, మళ్ల బ్రదర్ జంక్షన్ వద్ద శిబిరంలో గోవింద సత్యనారాయణ మాట్లాడారు. చంద్రబాబు సభలకు, లోకేష్ యువగళం పాదయాత్రలకు వస్తున్న ప్రజాదరణ చూసి తట్టుకోలేని క్రిమినల్ మైండ్ సెట్ ఉన్న ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అండ్‌కో చంద్రబాబును జైల్లో పెట్టాలన్న కుట్రపూరిత ఆలోచనతోనే అరెస్టు చేశారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కెకెవిఎ.నారాయణరావు, బొలిశెట్టి శ్రీనివాసరావు, బోడి వెంకటరావు, కుప్పిలి జగన్, మళ్ల సురేంద్ర, కోట్ని బాలాజీ, జోగినాయుడు, ఉగ్గిన రమణమూర్తి, సబ్బవరపు గణేష్, పోలారపు త్రినాథ్, బొద్దపు ప్రసాద్, ధనాల విష్ణు చౌదరి, అండిబోయిన శేషు, బొడ్డేడ మురళి, మల్ల గణేష్, మల్ల శివన్నారాయణ బుద్ధ శ్రీను, విల్లూరి రమణబాబు, కాయల ప్రసన్న, కూరాకుల భారతి బుద్ధ భువనేశ్వర్రావు పోలిమేర నాయుడు దూలం ప్రసాదు గుర్రాల వాసు కర్రి మల్లేశ్వరరావు కడిమిశెట్టి నరసింగరావు బుద్ధ విశ్వనాథం, జామి రాజు పాల్గొన్నారు.

చోడవరం : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు ఆధ్వర్యంలో టిడిపి నేతలు సామూహిక దీక్ష చేపట్టారు. మాజీ ఎంపిపి జి వెంకటసత్యనారాయణ, ఎంవివి సత్యనారాయణ, దేవరపల్లి వెంకటఅప్పారావు, కోటేశ్వరరావు, బొడ్డేటి నాగగంగాధర్, జెట్టి మాణిక్యం, ఈశ్వరమ్మ, మాదిరెడ్డి జోగి నాయుడు పాల్గొన్నారు.

చీడికాడ: మాడుగుల పార్టీ కార్యాలయంలో నిరాహారదీక్ష కార్యక్రమం చేపట్టేందుకు వెళ్తున్న టిడిపి నేత పైలా ప్రసాదరావు, ఇతర నేతలను పోలీసులు నిర్బంధం చేసేందుకు ప్రయత్నించారు. ఈ సంధర్భంగా ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులకు, పైలాకు మధ్య వాగ్వాదం జరిగింది. శాంతియుతంగా నిరసన చేసేందుకు కూడా అనుమతించకపోవడంపై నాయకులు మండిపడ్డారు.. దీంతో పోలీసులు వెనక్కి తగ్గగా టిడిపి నేతలు మాడుగుల పార్టీ కార్యాలయంలో నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ, చంద్రబాబును తక్షణమే విడుదల చేయకపోతే ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు గృహాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అధికారం అడ్డుపెట్టుకుని తమను నిర్బంధం చేసేందుకు ప్రయత్నిస్తున్న బూడి ముత్యాల నాయుడుకి త్వరలోనే ప్రజలు గట్టి బుద్ధి చెబుతారన్నారు.



భీమిలిలో నినాదాలు చేస్తున్న నేతలు

ఈ కార్యక్రమంలో టిడిపి నేత, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, రైవాడ మాజీ సర్పంచ్ చల్లా నానాజీ, మాడుగుల టౌన్ టీడీపీ పార్టీ అధ్యక్షులు రంజిత్ వర్మ, క్లస్టర్ ఇంచార్జి పుప్పాల రమేష్, పల్లెల రాము, బండారు నరసింహ నాయుడు, మరువాడ ఈశ్వరరావు, లెక్కల కాశిబాబు, బొడ్డేటి నాయుడు, అప్పాన రమణ, అప్పాన భాస్కర రావు, జల్లి సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్:మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును అరెస్ట్‌పై నర్సీపట్నంలో మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదివారం ఆయన ఇంటి వద్ద సామూహిక నిరాహార దీక్ష చేపట్టారు. నలుపు వస్త్రాలతో ప్ల కార్డులు పట్టుకొని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అక్రమ అరెస్టు చేయడం దారుణమన్నారు. పోలీసులు, సిఐడి అధికారులు ముఖ్యమంత్రి జగన్ కళ్ళలో ఆనందం చూడడానికి పని చేస్తున్నారని విమర్శించారు.రాబోయే రోజుల్లో ప్రజల బుద్ధి చెబుతారని తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇటువంటి వారిపై సరైన చర్యలు ఉంటాయని ఆగ్రహించారు. రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే సైకిల్ రావాల్సి ఉందన్నారు.తమను ఇళ్ల నుండి కదలనీయకుండా హౌస్ అరెస్ట్ చేశారని, పోలీసులు కనీసం గేటు బయట కాలు పెట్టనీయలేదని విమర్శించారు. చంద్రబాబు నాయుడును అరెస్టు చేసిన వెంటనే ఆరుగురు గుండెపోటుతో మరణించారని అన్నారు.

నక్కపల్లి:మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ టిడిపి శ్రేణులు నిరాహార దీక్ష చేపట్టారు. నక్కపల్లిలో ఎన్.టి.ఆర్ విగ్రహం వద్ద పార్టీ పిలుపు మేరకు ఆదివారం నిరసన చేపట్టారు. నల్ల జెండాలు చేతబట్టి చంద్రబాబు అరెస్టును వ్యతిరేకిస్తూ నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, జిల్లా పరిషత్ కో ఆప్షన్ మాజీ సభ్యులు కొప్పిశెట్టి కొండబాబు, పార్టీ నాయకులు కురందాసు నూకరాజు, గింజాల లక్ష్మణరావు, వైబోయిన రమణ , నానేపల్లి రాఘవులు, కొప్పిశెట్టి శ్రీను, కెవి సత్యనారాయణ, ఆకేటి శాంతి, కర్రి ఆంజనేయులు, గట్టెం గణేష్, కొప్పిశెట్టి వాసు, దార్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా అచ్యుతాపురం జంక్షన్‌లో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్‌కుమార్ నాయకత్వంలో నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షాపరులకు. రమేష్ కుమార్ పూలమాలలు వేసి ప్రారంభించారు.ఎంపిటిసి ఎన్ నర్సింగరావు, ఎం



మాట్లాడుతున్న పైలా ప్రసాదరావు

బాబునాయుడు, లాలం రాజు, మామిడి శివ అప్పారావు, గుడేల కనకారావు, బండి సూర్యనారాయణ, పి కొండబాబు దీక్షలో కూర్చున్నారు.

యలమంచిలి : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా మెయిన్‌రోడ్డులోని పార్టీ కార్యాలయం ఎదురుగా టిడిపి జిల్లా పార్లమెంటరీ కార్యదర్శి విజయబాబు ఆధ్వర్యంలో దీక్షకు చేపట్టారు. పట్టణ పార్టీ అధ్యక్షులు శివనారాయణ, కార్యదర్శి రమణబాబు, బొద్దపు శ్రీనివాసరావు, కొఠారు సాంబ, ఇత్తంశెట్టి రాజు పాల్గొన్నారు. శిబిరం వద్ద 15 మంది పోలీసులు భద్రత కల్పించారు.

కోటవురట్ల:టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పెద్ద ఎత్తున టిడిపి శ్రేణులు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు జానకి శ్రీను, పుత్రేవు సూర్యారావు, కసిరెడ్డి ఏసు, ఎలమంచిలి సూర్యప్రకాష్, బొడ్డేటి వెంకటరమణ,తిరుమల రావు,సుంకర బాబి నాయకులు పాల్గొన్నారు.

యస్.రాయవరం:టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుపై మండలంలో సామూహిక నిరాహార దీక్ష చేపట్టారు. ఆదివారం మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షులు అమలకంటి అబద్ధం ఆధ్వర్యంలో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ పై మండల నాయకులు, కార్యకర్తలు సామూహిక నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు అమలుకంటి అబద్ధం మాట్లాడుతూ, నారా చంద్రబాబు నాయుడుపై అక్రమంగా కేసులు బడాయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ మాజీ అధ్యక్షులు నల్లపురాజు వెంకటపతి రాజు, సర్వసుద్ధి మాజీ సర్పంచ్ పడమట సతీష్, సైతరుపేట మాజీ సర్పంచ్ రావి రమణబాబు, సూదిపురం మాజీ సర్పంచ్ అవతారం, మాజీ ఎంపీటీసీ బుజ్జి గుర్రం రామకష్ణతదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం దీక్షలు, నిరసనల వార్తలు

గోపాలపట్నం : చంద్రబాబు అరెస్టను ఖండిస్తూ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే గణబాబు ఆధ్వర్యాన సామూహిక నిరాహారదీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గణబాబు కుమారుడు మౌర్య సింహ, టిడిపి నాయకులు పొలిమేర సీతారాం, మళ్ల శంకరరావు, పెంటకోట అజయ్, నరిపిన్ని సత్తిరాజు, నందవరపు సోములు, వాసుదేవరావు, చంద్రశేఖర్, మజ్జి సోమేష్, మూర్తి పట్నాయక్, బొడ్డేటి విజయ్, జోజి, ఆర్ఆర్.రాజు, మాత శ్రీను, యలమంచిలి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


భీమునిపట్నం : స్థానిక టిడిపి కార్యాలయం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాశర్ల ప్రసాద్, వై.అనిల్‌ప్రసాద్, పాసి త్రినాథకుమార్, సిహెచ్.శ్రీనివాస్, అంగటి రాము, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : 26వ వార్డులో పెద్ద లక్ష్మణ్ ఆధ్వర్యాన వార్డు కార్యాలయం వద్ద పార్టీ కార్యకర్తలు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు.

సింహాచలం: 98వ వార్డు టిడిపి అధ్యక్షులు పంచదార శ్రీనివాసరావు ఆధ్వర్యాన సింహాచలం తొలిపావంచ వద్ద కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో 98వ టిడిపి నాయకులు అవినాష్, బిసి రమణ, పితాని మధు, లోగీస ఈశ్వరరావు, సెడగం రాము పాల్గొన్నారు.



అనకాపల్లిలో మాట్లాడుతున్న నాగ జగదీష్



నక్కపల్లిలో ఆందోళన చేపడుతున్న నేతలు



కలిసిన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సందడి

ప్రజాశక్తి-నక్కపల్లి:స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 1998-99లో పాఠశాలలో చదువుకున్న పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన నక్కపల్లి పాఠశాల వేదికగా ఆదివారం కలుసుకున్నారు. ఉద్యోగ, వ్యాపార, రాజకీయాల్లో స్థిరపడిన వారంతా చాలాకాలం తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. చిన్ననాటి తీపి జ్ఞాపకాలను, చేదు అనుభవాలను ఒక్కసారి జ్ఞప్తికి తెచ్చుకున్నారు. చిన్నతనంలో చేసిన అల్లరి, ఆడిన ఆటలు, గురువులు బోధించే తీరు అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఉదయం నుండి సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. తమకు విద్య నేర్పిన ఆనాటి గురువులు శర్మ, వెంకట్రావు, నాగలక్ష్మి, శాంతి కుమారి, పివిఎస్ ఆచార్యులు, నాగేశ్వరావులను ఘనంగా సత్కరించారు. పాఠశాలలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు విద్యార్థులు నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆనాటి విద్యార్థులు కొప్పిశెట్టి బుజ్జి, నున్న సుధీర్, కొల్నాటి నానాజీ, గట్టెం సత్యనారాయణ, శ్రీదేవి, లీల దేవి, జ్యోతి, మణి,గంగిశెట్టి లోవరాజు పాల్గొన్నారు.

16 నుంచి సమ్మెకు సిద్ధంకండి

-జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు వెంకటరెడ్డి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జివిఎంసి నీటి సరఫరా, యుజిడి, పారిశుధ్యం, మలేరియా, వెటర్నరీ, పార్కులు మొదలగు అన్ని విభాగాల కార్మికుల డిమాండ్లను నెరవేరుస్తామని అంగీకరించి, మినిట్స్‌లో నమోదు చేసి మాటతప్పిన అధికారుల చర్యలను ఖండిస్తూ కార్మికులంతా ఈ నెల 16 నుంచి నిరవధిక సమ్మెకు సిద్ధం కావాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. సమ్మె సన్నాహక చర్యల్లో భాగంగా ఆదివారం నల్లబెల్లి రైవాడ కెనాల్ కార్మికులు, కృష్ణనాయుడుపేట కార్మికులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టర్నకాక్, ఎలక్ట్రికల్ హెల్పర్స్, ఫిట్టర్ హెల్పర్స్, రైవాడ కెనాల్ కార్మికులు, గార్డినర్లకు సెమీస్కిల్డ్ వేతనాలు చెల్లించడానికి అంగీకరించి అధికారులు మాట తప్పారన్నారు. రిటైరైన, చనిపోయిన కార్మికుల బిడ్డలకు ఉపాధి కల్పిస్తానన్నటువంటి హామీని కూడా మరిచారని తెలిపారు.

మహిళా మనోవికాస్ పనితీరు భేష్

ప్రజాశక్తి-కలెక్టరేట్ : మహిళా సాధికారత, మహిళాభ్యుదయమే ధ్యేయంగా మహిళలకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో మహిళా మనోవికాస్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సెక్రటరీ రేణుక రాణి కొనియాడారు. మహిళా మనోవికాస్ వ్యవస్థాపకురాలు సూరిబట్ల మాధవి బృందం అత్యధిక సంఖ్యలో క్రోచెట్ పోంచోస్‌లను ప్రప్రథమంగా ప్రపంచంలో తయారు చేసి గిన్నిస్ రికార్డ్ సాధించిన సందర్భంగా నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో క్రోచెట్ పోంచో ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రేణుక రాణి, ప్రత్యేక అతిథులుగా హాజరైన ఛాంబర్ అఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అఫ్ విశాఖపట్నం అధ్యక్షులు జీజ వాల్సరాజ్, ప్రముఖ న్యూట్రిషన్ ఉషా రాజు మాట్లాడారు. గిన్నిస్ రికార్డ్ సాధించిన టీంను అభినందించారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ లండన్ ప్రతినిధి స్వప్నిల్ డంగారికర్ మాట్లాడుతూ రికార్డు కోసం 1500 తయారు చేయాల్సి ఉండగా 2719 పోంచోస్ తయారు చేసి సరికొత్త రికార్డ్‌ను సంస్థ ప్రతినిధులు నెలకొల్పారన్నారు.

అనకాపల్లిని కరువు జిల్లాగా ప్రకటించాలి

-రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి -రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజు


ప్రజాశక్తి -పాయకరావుపేట: వర్షాలు లేక వేసిన వరి నారు మళ్ళు ఎండిపోయాయని, అడపా దడపా పడిన వర్షాలకు వరి నాట్లు ఎండిపోవడంతో రైతులు తీవ్రంగా నష్ట పోయారని, ఈ నేపథ్యంలో అనకాపల్లిని కరువు జిల్లాగా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. పాయకరావుపేట మండలం పాల్తేరు గ్రామంలో ఎండిన వరి నారు మళ్లను . ఆదివారం రైతు సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనకాపల్లి జిల్లాలో 24 మండలాలలో తీవ్రమైన కరువు దుర్భిక్ష పరిస్థితిలు నెలకొన్నాయన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఈ ఖరీఫ్ సీజన్ కు 1,34,000 ఎకరాలలో వారి సాగు చేయాల్సి ఉండగా నేటికీ కేవలం 60 వేల ఎకరాల్లో మాత్రమే వరి ఉడుపులు అయ్యాయన్నారు. పాయక రావుపేట మండలం లో 3,168 ఎకరాలలో వరి పంట వేయాల్సి ఉండగా నేటికీ కేవలం 469 ఎకరాలలోను, పాల్తేరు గ్రామంలో ఈ ఖరీఫ్ సీజన్లో 495 ఎకరాలలో వరి పంట వేయాల్సి ఉండగా నేటికీ 20 నుండి 25 ఎకరాలలో మాత్రమే వరి పంట వేశారన్నారు. జిల్లాలో కరువు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చునని తెలిపారు. వెంటనే ప్రభుత్వం స్పందించి క్షేత్ర స్థాయిలో వ్యవసాయ, రెవెన్యూ అధికారులను పంపించి వరి నారు మళ్ళు పరిశీలించి, నష్టపోయిన రైతులను గుర్తించి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. అదేవిధంగా కరువు ప్రాంతంగా ప్రకటించి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. వ్యవసాయంకు తీసుకున్న బ్యాంకు రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కరువు ప్రాంతాల్లో వెంటనే రైతులకు, వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించి ఆదుకోవాలని కోరారు. అనకాపల్లి జిల్లా లో ఇంతటి కరువు దుర్భిక్ష పరిస్థితిలను ఎన్నడూ చూడలేదని తెలిపారు. పాలకులకు దూర దృష్టి లేక పోవడంతో ఇటువంటి దుర్భిక్ష పరిస్థితులు దాపురించాయని తెలిపారు. పోలవరం ఎడమ కాలువ పూర్తయితే అనకాపల్లి జిల్లాలో 1 లక్షా 60 వేల ఎకరాలకు, సుజల స్రవంతి ప్రోజెక్ట్ పూర్తి అయితే 2 లక్షల 70 వేల ఎకరాలకు మొత్తం జిల్లాలో 4 లక్షల 30 వేల ఎకరాలకు సాగునీరు, తాగు నీరు అందడానికి అవకాశం కలుగుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ కరువు నుంచి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.నాగేశ్వరరావు, డి.చిన్నారావు, ఎ.అప్పన్న, జీ.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అధికార పార్టీలో గ్రూపుల గోల

- తలలు పట్టుకుంటున్న పార్టీ శ్రేణులు - గ్రామాల్లో సమస్యలపై దృష్టి సారించని నాయకులు

ప్రజాశక్తి -కోటవురట్ల:వైసిపి మండల అధికార పార్టీ నాయకులు, పాలకపక్ష సభ్యుల మధ్య అనిచ్చితి కొనసాగుతుంది. ప్రధానంగా మండలంలో అధికార పార్టీ లో మూడు వర్గాలుగా విడిపోయి పని చేయడంతో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తలలు పట్టు కుంటున్నారు. ప్రధానంగా రాష్ట్రంలో జిల్లాలో ఒక సందర్భంలో చక్రం తిప్పిన మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణ రాజుకు స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబురావు మధ్య వైసిపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి స్నేహపూర్వక బంధం కొరవడింది. కొన్ని సందర్భాలలో మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణ రాజు అధికార పార్టీ కార్యక్రమాలను జోక్యం చేసుకోకుండా దూరంగానే ఉంటున్నారు. గడిచిన సార్వత్రిక ఎన్నికల అనంతరం వెలుగులోకి వచ్చిన సీతారామరాజు మండలం పై పట్టు సాధించేందుకు విశ్వ ప్రయత్నము చేస్తున్నారు. ఇందులో భాగంగా గడిచిన మండల పరిషత్ ఎన్నికల్లో ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేసి ప్రస్తుతం వైస్ ఎంపీపీ గా కొనసాగుతున్నారు. ఎంపీపీ అప్పలనాయుడు రాజకీయ కార్యక్రమాలకు, సమావేశాలకు హాజరైనా మండలంలో జరుగుతున్న రాజకీయ, ఆర్థిక కార్యక్రమాలను కూడా పట్టించుకోకపోవడంతో మండలంలో అంతా తానై సీతారామరాజు వ్యవహరిస్తూ ఉండటం విశేషం.

ఇకపోతే ప్రస్తుత జడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి భర్త సత్యనారాయణ మరో వర్గాన్ని ఏర్పాటు చేసుకుంటూ తనదైన శైలిలో రాజకీయాన్ని చక్రం తిప్పే విధంగా పావులు కదుపుతున్నారు. తనకొచ్చిన జడ్పిటిసి నిధులను సక్రమంగా వినియోగిస్తూ సమస్య జటిలమైన చోట రాజకీయ పార్టీలకు అతీతంగా సమస్యపై దృష్టి సారించి ఖర్చు పెడుతున్నాడని మరో వర్గాన్ని కొనసాగిస్తున్నారని ప్రచారం సాగుతోంది.



ఇదిలా ఉండగా మండల పరిషత్ నిధులు సక్రమంగా ఖర్చు చేయకపోవడంతో సుమారు 75 లక్షల వరకు నిధులు మురిగి ఉండడంతో ఇటీవల జడ్పీ సీఈవో శ్రీరామమూర్తి సిబ్బందిపై సైతం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలక పక్షం మధ్య సరైన అవగాహన లోపించడంతో నిధుల ఖర్చు విషయంలోనూ తీవ్ర అనిచ్చితి కొనసాగుతుంది. మండల పరిషత్ నిధులను వృధాగా ఖర్చు చేస్తున్నారని సీఈవో శ్రీరామమూర్తి సిబ్బంది పై ఆగ్రహం వ్యక్తం చేయడం విశేషం. తంగేడు గ్రామంలో శ్మశాన వాటికకు నాలుగు లక్షలు ఖర్చు చేయడం, గొట్టువాడ డిజిటల్ లైబ్రరీకి నిధులు వృధాగా ఖర్చు చేయడంపై అధికార ప్రతిపక్ష పార్టీలో తీవ్రమైన చర్చ కొనసాగింది. ప్రధానంగా మండల పరిషత్ కార్యాలయంలోకి వర్షపు నీరు చొచ్చుకు వస్తున్నా నిధులు కార్యాలయానికి ఖర్చు చేయడంలో వెనకడుగు వేస్తూ ఉండటం విశేషం. దీంతో కార్యాలయానికి వచ్చే సిబ్బంది, ప్రజలు అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది.


గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం పూర్తిగా పడకేసింది. సమస్యలను పట్టించుకోకపోవడం పాలకవర్గ నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది. 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు సక్రమంగా జమ కాకపోవడంతో గ్రామీణ ప్రాంతాలలో అపారిశుద్ధ్యం తాండవిస్తోంది. పాలక పక్షం పట్టించుకోక పోవడం, నాయకుల్లో సమన్వయ లోపం కారణంగా ప్రధాన సమస్యలు పరిష్కారం పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు స్పష్టంగా వినిపిస్తున్నాయి గ్రామీణ ప్రాంతాల్లో అన్నవరం, కొడవటిపూడి, రాజుపేట, గిరిజన గ్రామాలైన కోదండరాంపురం, తడపర్తి, అనుకు గ్రామాలకు రోడ్డు నిర్మాణాలకు నిధులు కేటాయించాల్సి ఉన్నా ఎవరూ పట్టించుకోలేదు. ప్రధాన సమస్యలు జల్లూరు, పందూరు వంతెనల నిర్మాణం పట్టించుకున్న నాధుడే కరువయ్యాడు. ఇప్పటికైనా అధికార పార్టీ నాయకులు మండలంలో ఉన్న ప్రధాన సమస్యల పట్ల దృష్టి సారించాలని, లేనిపక్షంలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపుతుందని పార్టీ నాయకుల్లో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా మలుపులు

-ఆపై రోడ్డుకిరువైపులా మొక్కలు- భయాందోళన చెందుతున్న వాహనదారులు

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల కేంద్రం నుండి అడ్డరోడ్డు ప్రయాణం అంటే అవస్థలు పడుతున్నారు మండల వాసులు. ప్రభుత్వం వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకుని ఐదవ సంవత్సరంలోకి అడుగుడినా అడ్డురోడ్డు వెళ్లే దారిలో రామచంద్రపురం నుండి అడ్డరోడ్డు వెళ్లే వరకు మలుపులతో అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రధానంగా రాత్రి సమయంలో ప్రయాణం నరకప్రాయం. ఒకపక్క గోతులు, మరోవైపు మలుపులు, దీనికి తోడు తుప్పలు. నిత్యం ఏదో ఒక పనిపై ఇదే రోడ్డుపై స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబురావు సహా డివిజన్ స్థాయి అధికారులు జిల్లా స్థాయి అధికారులు నిత్యం ప్రయాణిస్తూనే ఉంటారు. అయినా కనీసం రోడ్డు గురించి పట్టించుకోలేదని స్థానికులు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు.

ఇందేసమ్మువాక వద్ద నుండి అడ్డు రోడ్డు వెళ్లే వరకు ఏ క్షణాన ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భారీ వాహనాలు సహా ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.పోలవరం కాలువ వద్ద రోడ్డు సమీపంలో గొయ్యి ప్రమాదకరంగా దర్శనమిస్తుంది. రోడ్డుకు ఇరువైపులా వైన్డింగ్ నిమిత్తం గోతుల తవ్వి వదిలేయడంతో కనీసం అధికారులు సైతం పట్టించుకోకపోవడం దారుణమంటూ ఆయా ప్రాంతవాసులు తీవ్ర విమర్శలు గుర్తిస్తున్నారు. అధికారులు నాయకులు ఇప్పటికైనా స్పందించి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి తక్షణమే పనులు ప్రారంభించాలని కోరుకుంటున్నారు.



మలుపు ఉన్న రహదారి